తాగునీటి కష్టాలు.. పట్టించుకునేదెవరు..?


మోటార్ పాడవ్వడంతో అస్తవ్యస్తంగా ఉన్న పైప్‌లైన్లు

- ఏడాది నుంచి అరకొరగా కుళాయి నీరు
- మోటార్ పాడైతే పట్టించుకునే దిక్కే లేదు
- ఎప్పటికప్పుడు సమస్యలతో ట్యాంక్‌లకు ఎక్కని నీరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ఖాళీగా ఉన్న 1.5 లక్షల కిలోలీటర్ల ట్యాంక్

చీపురుపల్లి: నిన్న కాదు.. మొన్న కాదు.. ఏకంగా ఏడాది కాలంగా ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. కుళాయిల ద్వారా తాగునీరు ఎప్పుడు సరఫరా అవుతుందో.. ఎప్పుడు అవ్వదో తెలియని పరిస్థితి. వచ్చినా అరకొరగా మాత్రమే సరఫరా అవుతోంది. సమస్య ఏమిటో తెలియదు కాని మొత్తానికి ప్రజలు తాగునీటి కోసం రోజంతా ఎదురు చూడాల్సి వస్తోంది. గతంలో ఎప్పుడు తాగునీటి సమస్య ఎదురైనా వెంటవెంటనే మరమ్మతులు చేయించి సరఫరా పునరుద్ధరించేవారు. కాని ఇప్పుడు మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఏడాది కాలంగా తాగునీటి సమస్య ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల కిందట ఇదే సమస్యపై 'సాక్షి' పత్రికలో కథనం వెలువడడంతో దీనికి స్పందించిన ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు తన కుమారుడు రామ్ మల్లిక్‌నాయుడును ప్రాజెక్ట్ పరిశీలనకు పంపించారు. పాపం ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు అంతా వెళ్లి సమస్య వివరించారు. తక్షణమే నాన్న గారితో చెప్పి సమస్య పరిష్కరిస్తానని మల్లిక్ నాయుడు హామీ ఇచ్చినా ఇంతవరకు ఎటువంటి పురోగతి లేకపోవడం విశేషం.

ఏడాది కిందటే పాడైన మోటార్..

ఇందిరమ్మ సుజలధార తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సంప్‌లు, వాటర్ ట్యాంక్‌లున్నాయి. దీనికి సంబంధించిన రెండు మోటార్లు కూడా అదే ప్రాంగణంలో ఉన్నాయి. చీపురుపల్లి పట్టణానికి సంబంధించి 4.5 లక్షల కిలోలీటర్ల సామర్థ్యం గల రెండు ట్యాంక్‌లు.. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి 1.5 కిలోలీటర్ల సామర్థ్యం గల ఓహెచ్‌బీఆర్‌తో పాటు 9 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు సంప్‌లు ఉన్నాయి. అయితే సంకిలిలోని నాగావళి నది నుంచి పైపులైన్ల ద్వారా వచ్చే నీటిని ఈ మోటార్ల ద్వారా ట్యాంక్‌లకు ఎక్కించి చీపురుపల్లితో పాటు గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేస్తారు. అయితే రెండు మోటార్లలో ఒక మోటారు ఏడాది కిందటే పాడైంది. దీంతో ఉన్న ఒకే ఒక మోటార్‌తో అరకొరగా నీరు ట్యాంక్‌లకు ఎక్కుతోంది.

ప్రజలకు అందని తాగునీరు..

ఏడాది కాలంగా చీపురుపల్లి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు అరకొరగానే తాగునీరు అందుతోంది. గతంలో రోజు తప్పించి రోజు కుళాయిల ద్వారా తాగునీరు అందేది. కానీ గత ఏడాది కాలంగా వారానికోసారి మాత్రమే తాగునీరు సరఫరా అవుతోంది. అదికూడా అంతంతమాత్రమే. ఏడాది కిందటే మోటారు పాడైతే పట్టించుకోకపోవడంపై ఎంతవరకు న్యాయమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఫలించని ఎమ్మెల్యే కుమారుడి పరిశీలన..

ఇందిరమ్మ సుజలధార ప్రాజెక్ట్ ద్వారా తాగునీరు సరఫరా జరగడం లేదని కొద్ది రోజుల కిందట 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనంతో ఎమ్మెల్యే కుమారుడు కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న మోటార్లు, ట్యాంక్‌లు, సంప్‌లను పరిశీలించారు. అక్కడున్న సమస్యను అధికారులు ఆయనకు వివరించారు. అయితే నాన్న గారితో చెప్పి త్వరితగతిన మోటార్లు బాగు చేయిస్తానని చెప్పినప్పటికీ ఇంతవరకు ఎలాంటి ప్రయోజనం లేదని అధికార వర్గాల నుంచే వినిపిస్తోంది.

క్లుప్తంగా

తల్లిపాలే బిడ్డకు మేలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట: తల్లిపాలు బిడ్డకు అమృతంలా పనిచేస్తాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టాలన్నారు. ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ.. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దాడి అమానుషం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు, సభ్యులు

మెరకముడిదాం: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడి అమానుషమని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కిల్లాడ సురేంద్ర మాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగ సూచనల మేరకు స్థానిక ఎస్సీ కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు బోనెల గోపి మాదిగ, మండల అధ్యక్షుడు రిట్టపల్లి అప్పారావుమాదిగ, సంకిలి నాగేశ్వరరావు మాదిగ, నగురున వీస్ మాదిగలతో కలిసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక తహసీల్దార్ సులోచనారాణికి వినతిపత్రం అందజేశారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

- సీఐ జీఏవీ రమణ


మాట్లాడుతున్న సీఐ జీఏవీ రమణ

గజపతినగరం: దీపావళి పండుగను పురస్కరించుకుని ఆకతాయిలు అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ జీఏవీ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దీపావళి రోజున ఆకతాయిలు పోటీపడి మందుగుండు కాల్చి ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే దీపావళి పేరిట వచ్చిన మెసేజ్‌లకు స్పందించవద్దని.. ఇవి సైబర్ మోసాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. సైబర్ మోసాలు జరిగితే వెంటనే 1930 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వ అనుమతుల్లేకుండా ఎవరైనా మందుగుండు విక్రయించినా, తయారుచేసినా చర్యలు తప్పవన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న విజయనగరం ఎ.డి దామోదరరావు

చీపురుపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్యశిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థకశాఖ విజయనగరం డివిజన్ ఎ.డి డాక్టర్ దామోదర్ పిలుపునిచ్చారు. మండలంలోని రావివలసలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 65 పశువులకు గర్భకోశ చికిత్సలు, 36 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి రాధాకృష్ణ, చీపురుపల్లి ఎ.డి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత తప్పనిసరి


ఎంకేవలసలో అవగాహన కల్పిస్తున్న ఏఓ పూర్ణిమ

జామి: వరి పైరుకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ తెలిపారు. మండలంలోని ఎం.కే వలసలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శత్రు, మిత్ర పురుగులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ షేక్ అహ్మద్, వీఏఏ షేక్ కరీం, తదితరులు పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు


వేణుగోపాలస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శృంగవరపుకోట: పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఏకాదశి శుక్రవారం సందర్భంగా పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం స్వామి పవిత్రోత్సవాలను జరిపిస్తున్నట్లు పండితులు తెలిపారు. నాలుగు రోజుల పాటు విశేష పూజలు చేపడతామన్నారు.

ప్రజల ఆరోగ్యాలతో 'కూటమి' చెలగాటం

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ


చిన్నరావుపల్లి గ్రామంలో కోటి సంతకాల సేకరకణపై వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన 17 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు మండలంలోని కాటికాపల్లి, చిన్నరావుపల్లి గ్రామాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడు బాబుతో కలిసి కడుబండి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కడుబండి మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్వహిస్తే.. కూటమి ప్రభుత్వం వాటిని కావాలనే నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామానికి వెళ్లి ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల జరగనున్న నష్టాలను ప్రజలకు వివరించి సంతకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొరపల్లి జయప్రకాష్‌శివ, కొత్తవలస, ఎస్.కోట జెడ్పీటీసీ సభ్యులు నెక్కల శ్రీదేవి, ముమ్మలూరి వెంకటలక్ష్మి, కంటికాపల్లి, చిన్నరావుపల్లి సర్పంచ్‌లు పీతల కృష్ణ, బూసాల దేముడు, కంటకాపల్లి ఎంపీటీసీ సభ్యుడు పరదేశినాయుడు, మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పార్టీ నాయకులు మదీన అప్పలరాం, యడ్ల కిశోర్, కూనిరెడ్డి వెంకటరావు, గొర్లె శ్రీనివాసరావు, సింగంపల్లి గణేష్, జామి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ అధ్యాపకుడి (గెస్ట్ ఫ్యాకల్టీ) పోస్టు కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అభ్యర్థులు తమ విద్యార్హతలతో కూడిన దరఖాస్తును ఈనెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా కళాశాలలో అందించాలన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. అలాగే నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డి లాంటి అదనపు విద్యార్హతలుంటే ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థిచే పాఠ్యాంశాలను చదివిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈఓ బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని అరిగిపాలెం, సోంపురం ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరు, రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అంచనా వేశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌పై నిలదీత

గుర్ల: ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్నా ఇంతవరకు ఈ క్రాప్ నమోదు 40 శాతం కూడా పూర్తికాకపోవడంపై వ్యవసాయాధికారులను ఎంపీపీ పొట్నూరు ప్రమీల, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు నిలదీశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారుల పనితీరు సక్రమంగా లేకపోవడంతో గ్రామాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారని కొండగండ్రేడు సర్పంచ్ సారిక గోవింద్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గతేడాది కూడా ఈక్రాప్ సక్రమంగా చేయకపోవడంతో రైతులు ధాన్యం అమ్మకోలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గడిగెడ్డ రిజర్వాయర్ కుడి , ఎడమ కాలువలలో పూడికలు తొలగించాలని ఎంపీటీసీ సభ్యుడు బూర్లె జోగినాయుడు అధికారులకు సూచించారు. వేసవి కాలంలో పనులు చేపడతామని ఇరిగేషన్ అధికారి సంతోష్ తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అంబల్ల లక్ష్మి, తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపీడీఓ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై అవగాహన

గజపతినగరం: పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ బి. కల్యాణి తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీలో తడి, పొడి చెత్త సేకరణపై సిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ నరవ కొండమ్మ, కిశోర్‌కుమార్, పంచాయతీ ఈఓ జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

సాగు హక్కులు కల్పించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిన్నిపాలెం రైతులు


కొత్తవలస: మండలంలోని చిన్నిపాలెంలో తాత, ముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూములపై హక్కులు కల్పించాలని రైతులు కోరారు. ఈ మేరకు చిన్నిపాలెం గ్రామ రెవెన్యూ భూముల సంరక్షణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ పి.అప్పలరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 12 వందల ఎకరాల భూమి ఉండగా.. ఇప్పటికే కొంతమంది రియల్టర్లు, కంపెనీల యజమానులు ఆ భూములను రెవెన్యూ రికార్డుల్లో వారి పేరిట మార్చుకున్నారన్నారు. అధికారులు స్పందించి రీ సర్వే చేపట్టి తమకు సాగు హక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంక్షేమ సమితి సభ్యులు తమడపు అప్పారావు, మొయ్యి దేముడు, బాదిరెడ్డి వెంకటరమణ, కె.సూరిదేముడు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు 25 శాతానికి పెంచాలి


మహాధర్నాలో పాల్గొన్న దళిత సంఘాల నేతలు

శృంగవరపుకోట: ఎస్సీల రిజర్వేషన్లు 25 శాతానికి పెంచాలంటూ బహుజన నేత ఎస్ఆర్ వేమన డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక దేవీచౌక్ వద్ద అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ప్రతినిధి ఎ.ఉదయ్‌భాస్కర్ నేతృత్వంలో ఎస్సీ కులస్తులు, దళిత సంఘాల నేతలు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని, అట్రాసిటి చట్టంలో సెక్షన్ 41 రద్దు చేయాలని.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలని, సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌ను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యమ నేతలు ఆదాడ మోహనరావు, కెల్ల భీమారావు, గొల్ల ఈశ్వరరావు, గంటాన అప్పారావు, పెద్ద సూరిదేముడు, ఎద్దు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు దళిత నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాబ్ కార్డులున్న వారందరికీ పని


గ్రామంలో చేపట్టబోయే పనులను మ్యాప్ ద్వారా ఎంపీపీకి వివరిస్తున్న ఏపీఎం విజయలక్ష్మి

లక్కవరపుకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని గనివాడలో 2026 - 27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులకు సంబంధించి శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రంగులతో మ్యాప్‌లు వేసి ఏపీఓ విజయలక్ష్మి వివరించారు. గ్రామంలో ఏఏ తరహా పనులు నిర్వహిస్తాం.. ఈ పనుల వల్ల జరగనున్న అభివృద్ధిని వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గుర్తించిన పనులను సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవ్వ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో నిరంతర అన్నదానం


శ్రీమణికంఠ ధర్మశాస్తా పీఠంలో భిక్ష చేస్తున్న అయ్యప్పస్వాములు

శృంగవరపుకోట: శరణం అయ్యప్పా అంటూ పల్లెలు, పట్టణాలు శరణుఘోషతో మార్మోగుతున్నాయి. మాలధారణ చేసిన భక్తులు భిక్షకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎస్.కోట పట్టణం శ్రీనివాస కాలనీలో శ్రీమణికంఠ ధర్మశాస్తా పీఠం నేతృత్వంలో 41 రోజుల పాటు నిరంతర అన్నదాన కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. మొదటి రోజు సుమారు 200 మంది స్వాములు వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా గురుస్వాములు శ్రీనివాసరావు, సూర్యప్రతాప్ మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీ నుంచి నవంబర్ 26 వరకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని దీక్షాపరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డబ్బులు లేవనడం సిగ్గుచేటు..



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

- వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి
- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స

గంట్యాడ: పేద విద్యార్థులకు వైద్య విద్యను.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించి ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్వహణకు కూటమి ప్రభుత్వం డబ్బుల్లేవనడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. కళాశాలల నిర్వహణకే డబ్బుల్లేనప్పుడు రాజధాని నిర్మాణానికి లక్షల కోట్ల రూపాయలు ఎక్కడ నుంచి తీసుకువస్తారని ప్రశ్నించారు. మండలంలోని కొండతామరపల్లి జంక్షన్‌లో ఉన్న కల్యాణ మంటపంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్య నాయకులతో పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ హయంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన గొప్ప నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. వైద్య కళాశాలలను నిర్వహించలేని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మాత్రం కోట్లాది రూపాయల విలువ చేసే భూములను రూపాయికే కట్టబెడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పీరుబండి హైమావతి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కె. విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటరావు, పార్టీ నాయకులు నారాయణమూర్తి రాజు, కృష్ణంరాజు, కోడెల ముత్యాలనాయుడు, లచ్చిరెడ్డి కృష్ణ, వర్రి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం తగదు

- కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు


పత్తికాయవలసలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని అలజంగి, పత్తికాయవలస పంచాయతీల్లో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ సంతకాలు సేకరించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తూ కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ దన్నాన జనార్దనరావు, అలజంగి సర్పంచ్ రఘుమండ త్రినాథరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రేవల్ల సత్తిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బవిరి రవిశంకర్, పీఎంసీ చైర్మన్ గవిడి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


బొండపల్లి: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ చలంనాయుడు


గుర్ల: మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రమీల, నాయకులు


ఎల్.కోట: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


కొత్తవలస: పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు నెక్కల శ్రీదేవి

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ శుక్రవారం నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను డివిజన్, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు పోటాపోటీగా క్రీడల్లో తలపడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్


చీపురుపల్లి: లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థి


జామి: ఎంపికయిన క్రీడాకారులతో ఎంఈఓ గంగరాజు, తదితరులు


దత్తిరాజేరు: మరడం ఉన్నత పాఠశాలలో క్రీడా ఎంపికలు ప్రారంభిస్తున్న ఎంఈఓ సుధాకర్


ఎస్.కోట : ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు


గంట్యాడ: స్కూల్ గేమ్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న ఎంపీపీ హైమావతి


మెరకముడిదాం: గర్భాం జెడ్పీ పాఠశాలలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి వేణుగోపాలరావు, తదితరులు